క్లుప్తంగా

ఆడపిల్లల అక్షరాస్యతతోనే దేశప్రగతి

పాల్వంచరూరల్: ఆడ పిల్లలు వందశాతం అక్షరాస్యత సాధించినప్పుడే దేశానికి నిజమైన ప్రగతిని సాధించినట్లని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సమానత్వ దినోత్సవాన్ని నిర్వహించగా ఆమె మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ముందు ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ జె.మాధవి, టి.అరుణకుమారి, డి.రమేశ్, కామేశ్వరరావు, స్వరూపారాణి, ఎస్.శ్రీదేవి, సీహెచ్ సౌమ్య, దీపిక, విమల పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ

టేకులపల్లి: ప్రస్తుతం రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం జరుగుతోందని, ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసిందని ఇల్లెందు డివిజన్ వ్యవసాయ అధికారి (ఏడీఏ) జి.లాల్‌చంద్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు రైతు వేదికలో జరిగిన రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. రుణమాఫీకి సంబంధించి కుటుంబ సభ్యుల ధ్రువీకరణపత్రం, కుటుంబ సభ్యులతో వ్యవసాయ శాఖ అధికారి ఫొటో దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, భాగ్యశ్రీ, విశాల, ప్రవీణ్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు పీహెచ్‌సీ పరిధిలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై కళాజాత నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులకు గురైన వారు సత్వర వైద్యం పొంది ఉపశమనం పొందేలా పీహెచ్‌సీ, హెల్త్‌సబ్‌సెంటర్‌లను ఆశ్రయించాలని సూచిస్తూ కళాకారులు పాటలు, నాటికల రూపంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డాక్టర్ కవిత, సిబ్బంది, కళాకారులు బాలు, కాంపెల్లి నందు, నరేంద్ర, మూసా, స్నేహ, నీల, కుమారి, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

వీకే-7 ఓసీకి అనుమతులివ్వాలని వినతి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే-7 ఓసీకి, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓపెన్‌కాస్ట్ గనులకు సంబంధించిన స్టేజ్-1 అనుమతులివ్వాలని కేంద్ర, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి, ఫారెస్ట్రీ అడ్వయిజరీ కమిటీ (ఎఫ్ఏసీ)కి సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు మంగళవారం ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం అందించారు. ఈఎంఓఎఫ్ సమావేశం బుధవారం ఢిల్లీలో జరగనున్న నేపథ్యంలో అనుమతుల విషయం సులభతరం చేసి వీలైనంత త్వరలో అనుమతులు ఇప్పించాలని కోరారు.

సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు పంపిణీ

ఇల్లెందు: 2023 వరకు తమ ఖాతాల్లో జమ అయిన డబ్బులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను సింగరేణి ఇల్లెందు ఏరియాలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అందించారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. ఉద్యోగులంతా తమ ఖాతాల్లో సీఎంపీఎఫ్ జమ అయ్యేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు, నాగరాజునాయక్, మహేశ్, సాయిస్వరూప్, నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

పాల్వంచరూరల్: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వివేక్‌కు అందించి ప్రసంగించారు. రుణమాఫీ విషయంలో అనేక ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఉమర్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కుంజా కృష్ణ, బుర్రా, వినోద, వెంకటేశ్వర్లు, ఎర్ర శ్రీనివాస్, రాజేశ్, రూప్‌సింగ్, గోపి, రాఘవులు, బీమా, ఈరమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

టేకులపల్లి: బదిలీ అయిన ఉపాధ్యాయులకు మంగళవారం ముత్యాలంపాడు ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ టీచర్ల ఆధ్వర్యంలో సత్కారం చేశారు. ముత్యాలంపాడు కాంప్లెక్స్ మాజీ హెచ్‌ఎం ఎం.మంగీలాల్, సీహెచ్ మాధవి, మోతుకూరి పద్మ, ఇ.రాజకుమారి, బి.అరుణ, బి.రవికి ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్, మండల నోడల్ ఆఫీసర్ జగన్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. డి.రాంచందర్ సింగ్, జి.మోతిలాల్, లక్ష్మణ్, ప్రసాద్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తాలేని 'మన ఊరు-మన బడి'

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లోనూ నత్తనడకన పనులు
- 46 పాఠశాలలకు రూ.1.66 కోట్ల నిధులు
- 12 పాఠశాలల్లోనే పనులు పూర్తి


యానంబైల్ హైస్కూల్‌లో పునాదులు తీసి వదిలేసిన దృశ్యం

పాల్వంచరూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు – మన బడి పనుల్లో పురోగతి లేకపోగా ప్రస్తుత ప్రభుత్వం అమలుచేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లోనూ అదే పరిస్థితి నెలకొంది.

'ఆదర్శం' అంతంతే..

మండలంలో 46 ప్రభుత్వ స్కూళ్లను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. ఇందులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1.66 కోట్లు మంజూరు కాగా 12 పాఠశాలలో మాత్రమే పనులు చేపట్టారు. ఇంకా 34 పాఠశాలలో పనులు కాలేదు. నారాయణరావుపేట, బోజ్యాతండా పాఠశాలలో ఇంతవరకు పనులు ప్రారంభమే కాకపోవడం గమనార్హం. అన్ని హంగులతో విద్యాసంవత్సరం ప్రారంభంనాటికి పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఘనస్వాగతం పలకాలని కలెక్టర్ ఆదేశించినా అలా జరగలేదు. ఇరిగేషన్, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరిగిందనే విమర్శలు వస్తున్నాయి.

'మన బడి' ఇలా..

మండలంలోని జగన్నాథపురం, నాగారం, పునుకుల, యానంబైల్, తోగ్గూడెం, పాండురంగాపురంలో పాఠశాలల అభివృద్ధికి మన ఊరు – మన బడి ద్వారా 2022 జూన్‌లో రూ.90.91 లక్షలు, ఉపాధి హామీ ద్వారా రూ.1.13 కోట్లు మంజూరు చేశారు. ఇందులో జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలకు రూ.17,16 లక్షలు, నాగారం ప్రాథమిక పాఠశాలకు రూ.21.61 లక్షలు, పాండురంగాపురం ప్రాథమిక పాఠశాలకు రూ.24.42 లక్షలు, యానంబైల్ రూ.20.70 లక్షలు, పునుకుల పాఠశాలకు రూ.26,40 లక్షలు, తోగ్గూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.18.98 లక్షలు, నాగారం హైస్కూల్‌కు రూ.37.86 లక్షలు, యానంబైల్ హైస్కూల్‌కు రూ.36.90 లక్షల నిధులు మంజూరు కాగా ఐదు స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. ఇక యానంబైల్, నాగారం హైస్కూల్‌తో పాటు ఇంకొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. కాగా, పాఠశాల గదులు, వరండాలో ఫ్లోరింగ్ పనులు, విద్యుత్ మరమ్మతులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, రంగులు వేయించాల్సి ఉంటుంది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో రెండేళ్లు కావొస్తున్నా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పునుకులలోని పాఠశాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని అప్పటి కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేసి ఆదేశించినా అనుకున్న స్థాయిలో పనులు జరగలేదు.


నాగారం హైస్కూల్‌లో అసంపూర్తిగా పనులు

వచ్చే నెలలోగా పూర్తిచేస్తాం



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వచ్చే నెలలోగా పూర్తిచేయిస్తాం. ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి పనుల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టాం. ఇక మన ఊరు – మన బడి కింద పనులకు మళ్లీ అనుమతులు రావాల్సి ఉంది. అప్పుడే పనులు కొనసాగే అవకాశముంది.

–శ్రీరాంమూర్తి, ఎంఈఓ, పాల్వంచ

పనులన్నీ త్వరగా పూర్తిచేయాలి



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయలేదు. యానంబైల్ హైస్కూల్‌లో అభివృద్ధి పనుల కోసం పునాదులు తీసి వదిలివేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉన్నందున అధికారులు స్పందించి పనులు చేయించాలి.

– బుడగం నాగేశ్వరరావు, యానంబైల్

ఇకనైనా స్పందించాలి..



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్కూళ్లు తెరిచే నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా అలా జరగలేదు. కొన్నిచోట్ల పనులే మొదలు పెట్టనందున అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాలి.

– గద్దల రమేశ్, యానంబైల్

లేఔట్ ప్లాట్ల దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో లేఔట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ – 2000 కింద దరఖాస్తులు చేయగా వాటిని మంగళవారం క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులు వెంటనే వారి ప్లాట్ల హద్దులు కనిపించే విధంగా చదును చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుల ప్లాట్ రిజిస్ట్రేషన్, ఇతర ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీం, ఎ.రాధిక, డి.రామ్మూర్తి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టులు భర్తీచేయాలని ధర్నా

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని మంగళవారం ఆస్పత్రి ఎదుట పలువురు ధర్నా చేశారు. ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు సిబ్బంది లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, విషజ్వరాలతో వచ్చిన రోగులకు రక్తపరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో వారంతా పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బర్ల లక్ష్మణ్‌రావు, వెంకన్న, వీరస్వామి, రమేశ్, రాములు, నాగమణి, ప్రవళిక, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చుంచుపల్లి: టీజీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా మంగళవారం కొత్తగూడెం డిపో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి డిపో గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కందుల భాస్కర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 2013 ఆర్‌పీఎస్ బాండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని, అలవెన్స్‌లను తక్షణమే పెంచాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని, ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలని యాజమాన్యాన్ని కోరారు. చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆర్.ఎన్.సింగ్, కేఎన్‌బీ రావు, పీవీ ప్రసాద్, సాయి కృష్ణ, మాధవి, రేణుకదేవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు


రాజేందర్‌కు మిఠాయి తినిపిస్తున్న శ్రేణులు

ఇల్లెందు: కేంద్రం పన్నిన కుట్రలకు బీఆర్‌ఎస్ ఎన్నటికీ తలవంచదని, కవిత విషయంతో న్యాయమే గెలిచిందని బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ అన్నారు. మంగళవారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లాకావత్ దేవీలాల్‌నాయక్, సత్యనారాయణ, కౌన్సిలర్లు జేకే శ్రీను, తోట లలితశారద, శీలం రమేశ్, అజ్మీర భావ్‌సింగ్‌నాయక్, ఎండీ జబ్బార్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేశ్, హరిప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలో నిర్వహించిన సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, అంబుల వేణుగోపాల్, ప్రసాద్‌బాబు, తొగరు రాజశేఖర్, సంకుబాపన అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి మండలంలో..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. కొట్టి వెంకటేశ్వరరావు, వినోద్, మునీర్, నక్క మధు, రామకోటి, నాగబాబు, రాజవరపు మురళి, తుంపిరి ప్రసాద్, బానోతు రవి, లావుడియా వెంకటేశ్వర్లు, చిర్రా వెంకన్న, వెంకటాచలం పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: బీఆర్‌ఎస్ నేత కవితకు ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ మంజూరవడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో లక్కినేని సురేందర్‌రావు, బొమ్మర్ల వరప్రసాద్‌గౌడ్, బోడా బాలునాయక్, బానోత్ రామానాయక్, భూక్యా లాలునాయక్, తేజావత్ రవి, మౌలానా, బాలకృష్ణ, కిరణ్, భూక్యా చందర్, బోడా చందర్, జర్పుల రాజు, బానోత్ రవికుమార్, జాటోత్ నరేశ్, బోడా రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


టేకులపల్లి: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


సింగరేణి(కొత్తగూడెం): వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం చర్లపల్లి, జేత్యాతండా, పాతతండా, కుంటల్ల, సామ్యాతండా, పెట్రాంచలక, ఎర్రాయిగూడెం, బోడు, బర్లగూడెం, మూడుతండా, కాలనీతండా, బేతంపూడి, కొత్తతండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, సూపర్‌వైజర్లు గుజ్జ విజయ, కౌసల్య, సింగ్, పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి, అమూల్య, రుక్సానా, చందన, శైలజ, ఏఎన్ఎంలు నాగలక్ష్మి, ఎల్లమ్మ, స్వప్న, సుజాత, సైదమ్మ, కళావతి, రమాకుమారి, వెంకటరమణ, అరుణాదేవి, లక్ష్మి, అనసూయ, అరుణకుమారి పాల్గొన్నారు.

జామ్లాతండాలో వైద్యశిబిరం

సుజాతనగర్: మండలంలోని జామ్లాతండాలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 15 రోజులుగా జ్వరాలు విజృంభించిన నేపథ్యంలో 'జ్వరాలతో వణుకుతున్న గిరిజనం' శీర్షికన సాక్షిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. పలువురి రక్త నమూనాలు సేకరించారు.

10వ వార్డులో..

సింగరేణి(కొత్తగూడెం): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన పట్టణ ప్రజలను కాపాడేలా పీహెచ్‌సీల్లో ఖాళీలు భర్తీ చేయాలని 10వ వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ కోరారు. రామవరంలోని పదో వార్డులో వైద్యశిబిరం నిర్వహించగా ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయించడమే కాక ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులు, సిబ్బందిని కేటాయించాలన్నారు. కాగా, ఈ శిబిరంలో 80 మందికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాము, సిబ్బంది రావుల కవి, తార, భవాని, సుదర్శన్, సరోజతో పాటు నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించండి


కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఆర్టీసీ బస్‌డిపో నుంచి మారుమూల పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మాస్‌లైన్ అనుబంధ పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి, మాస్‌లైన్ డివిజన్ నాయకుడు రాఘవులు మాట్లాడారు. రహదారి సౌకర్యం సరిగా లేనిసమయంలోనే కొత్తగూడెం డిపో నుంచి మాణిక్యారం, బోయితండా గ్రామ పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం రహదారులన్నీ బీటీ రోడ్లుగా మార్పు చెందినా, ఇల్లెందు కేంద్రంగా బస్‌డిపో ఏర్పాటైనా బస్సు మాత్రం పల్లెలకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కౌసల్య, రామి, సిరి, బుజ్జి, సీతారాం, రాంజీ, హరిలాల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత మృతి

కొత్తగూడెంరూరల్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు స్టీవెన్ లాజరస్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, కోనేరు సత్యనారాయణ, మద్దెల శివకుమార్ మృతదేహాన్ని సందర్శించిన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంతోటి పాల్, మంద హనుమంత్, పిడుగు శ్రీను, అల్లి శంకర్, లావుడ్యా సత్యనారాయణ, జోసెఫ్, పొన్నెకంటి సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఆరు చెరువులు కబ్జాకు గురైనా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం తహసీల్దార్ వివేక్‌తో పాటు, మున్సిపల్, జల వనరుల శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో భూక్యా రవినాయక్, బట్టు శివ, వెంకటేశ్వరరావు, బానోతు ప్రతాప్, గంధం నాగేంద్రప్రసాద్, అలువాల సందీప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

జూలూరుపాడు: కాకర్ల పాలగుట్టపై కొలువైన శ్రీ రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామి వారికి పంచామృతంతో అభిషేకం, గోత్రానామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పూజారి ఫణిరాజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజల అనంతరం ఉట్టికొట్టే పోటీలు నిర్వహించగా యువకులు, పెద్దలు పోటీ పడ్డారు. జూలూరుపాడు శ్రీసీతారామాలయంలోనూ ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చెరుకుమల్ల కృష్ణయ్య, ఢిల్లీ వెంకటేశ్వర్లు, నరసింహారావు, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించాలి


వినతిపత్రం అందిస్తున్న ఇంజనీర్లు

పాల్వంచ: టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఏడేళ్లుగా పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం రాష్ట్రవ్యాప్త ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ల నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానిక కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో ఇన్‌చార్జ్ సీఈ జి.శ్రీనివాస్‌కి వినతిపత్రం అందించి, మాట్లాడారు. 2022లో ఇచ్చిన పదోన్నతులు సైతం వెనక్కి తీసుకోవడంతో ఇంజనీర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను సింగరేణి, జెన్‌కో జాయింట్ వెంచర్‌లో కాకుండా కేవలం జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని, జెన్‌కో సంస్థలో ఎంతో నైపుణ్యం కలిగిన ఇంజనీర్లు ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మంగీలాల్, బ్రహ్మాజీ, మహేశ్, మధుబాబు, యాకూబ్, రవి, రాజేశ్, సంతోష్, లక్ష్మీ, గణేశ్, నరేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను తొలగించొద్దు..


ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఇల్లెందు: సింగరేణి నిర్వాసితుల పేరుతో కొందరిని తీసుకొచ్చి కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి వెళ్లిపోవాలంటూ అధికార పార్టీ అనుబంధ సంఘం దౌర్జన్యం చేస్తోందని ఇల్లెందు ఏరియా ఏఐటీయూసీ, ఇఫ్టూ సంఘాలు ఆరోపించాయి. మంగళవారం ఇల్లెందు జీఎం ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ, ఇఫ్టూ నేతలు కె.సారయ్య, యాకుబ్‌షావలీ మాట్లాడుతూ జేకేఓసీలో నిర్వాసితుల పేరుతో కొందరిని తీసుకొచ్చి ఎంతో కాలంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని అధికార పార్టీ నేతలు దౌర్జన్యం చేయటం తగదన్నారు. 40 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించాలనం అన్యాయమని, ఎమ్మెల్యే కోరం కనకయ్య జోక్యం చేసుకోవాలని కోరారు. అనంతరం డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, కొత్తపల్లి రఘు, కనకతార, వెంకట్, రాజేశ్వరి, జమున, గంగ పాల్గొన్నారు.

పకడ్బందీగా యూరియా విక్రయాలు..


మాట్లాడుతున్న మెట్టెల కృష్ణ

ఇల్లెందురూరల్: దళారులకు అవకాశం ఇవ్వకుండా యూరియా విక్రయాల్లో పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మెట్టెల కృష్ణ స్పష్టంచేశారు. పీఏసీఎస్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే యూరియా విక్రయాలు చేపడుతున్నా నిబంధనల్లో లొసుగులను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. భవిష్యత్‌లో అలాంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ఆధార్‌కార్డు ప్రామాణికతతోపాటు వ్యవసాయశాఖ ధ్రువీకరణతో యూరియా విక్రయాలు చేపట్టేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. ఈ మేరకు పాలకవర్గం తీర్మానం పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కాగా, సస్పెండైన పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్ స్థానంలో ఆఫీస్ అసిస్టెంట్ హీరాలాల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఈఓ హీరాలాల్ పాల్గొన్నారు.

వార్డుల విభజన పారదర్శకంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వార్డుల విభజన పారదర్శకంగా ఉండేలా కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ పంచాయతీల వార్డుల విభజన ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గత స్థానిక ఎన్నికల సమయంలో ఒక పంచాయతీ ఓటర్లు మరో పంచాయతీలో, ఒక వార్డు ఓటర్లు మరో వార్డులో నమోదయ్యారని, కొన్ని గ్రామ పంచాయతీలకు భౌతికస్వరూపమే లేకుండా పోయిందని గుర్తుచేశారు.

ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: పెద్ద వైద్యం పేరిట కష్టాల్లో ఉన్న రోగుల నుంచి కాసులు పిండొద్దని, కేవలం ప్రథమ చికిత్సకే పరిమితం కావాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆర్ఎంపీలకు సూచించారు. మంగళవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఇల్లెందు, కొమరారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆర్ఎంపీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏరోగికైనా పెద్ద వైద్యం అవసరమైతే ప్రభుత్వ వైద్యశాలలకు రిఫర్ చేయాలని సూచించారు. ఆర్ఎంపీలను నమ్మి వైద్యం కోసం వచ్చే రోగుల నుంచి ఫీజుల రూపేనా గుంజితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ నాగుల్‌మీరా, బి.సూర్య, 35 మంది ఆర్ఎంపీలు పాల్గొన్నారు.